## రెండవ పాఠం

## الدرس الثاني

### వస్త్రధారణ ఆదేశాలు

### أحكام اللباس

3- పురుషులపై నిషిద్ధమున్న మరో విషయం: వారు తమ వస్త్రాలను చీలమండలం క్రిందికి తొడగుట. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా హెచ్చరించారని అబూ హురైర రజియల్లాహు అన్హు ఉల్లేఖించారు: **"చీలమండలానికి క్రింద ఉన్న లుంగి (వస్త్రం) వారి ఆ భాగం నరకంలో ఉండును"**. (బుఖారి 5787). అది పైజామా, పైంటు తదితర ఏ వస్త్రం అయినా సరే. కొందరి భ్రమ ప్రకారం 'గర్వంతో తొడిగే వారికి ఈ శిక్ష' అన్న మాట సరికాదు. గర్వం లేకుండా తొడిగే వారికే ఈ శిక్ష. గర్వంతో తొడిగే వారికి ఇంతకంటే మరీ ఘోరమైన శిక్ష గలదు. అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ రజియల్లాహు అన్హుమా ఉల్లేఖనం ప్రకారం, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించారు: "అహంకారంతో తన వస్త్రాన్ని (లుంగీ, పైంటు వగైరాలు) ఈడుస్తూ నడిచే వ్యక్తిని అల్లాహ్ పరలోకంలో కన్నెత్తి కూడా చూడడు". (బుఖారి 5791, ముస్లిం 2085). కాని స్త్రీలు తమ వస్త్రాలను క్రింది వరకు వ్రేలాడదీయాలి. పాదాలు కూడా కనబడకుండా ఉండాలి.

4- తొడిగి కూడా నగ్నంగా కన్పించేటటువంటి పలచని, సన్నటి వస్త్రాలు యోగ్యం కావు. అలాగే శరీరావయవాల పరిమాణాన్ని వర్ణించే విధంగా ఇరుకుగా తొడుగుట యోగ్యం కాదు. ఈ ఆదేశం స్త్రీ పురుషులందరికీ వర్తిస్తుంది. (ఒక సందర్భంలో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పారు: ధరించికూడా నగ్నంగా కన్పించే దుస్తులు ధరించే స్త్రీలు స్వర్గంలో ప్రవేశించరు, దాని సువాసన కూడా పొందరు. (ముస్లిం 2128).

5- పురుషులు స్త్రీల లాంటి మరియు స్త్రీలు పురుషుల్లాంటి బట్టలు తొడుగుట నిషేధం. ఇబ్నె అబ్బాస్ రజియల్లాహు అన్హు ఇలా చెప్పారు: "స్త్రీల వేషాధారణ వేసుకునే పురుషులను, పురుషుల వేషాధారణ వేసుకునే స్త్రీలను ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం శపించారు". (బుఖారి 5885).

6- అవిశ్వాసులు తమ ధార్మిక చిహ్నంగా ప్రత్యేకించుకున్న వేషాధారణ ముస్లిం ధరించడం నిషిద్ధం. అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ రజియల్లాహు అన్హుమా ఉల్లేఖించారు: ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నా ఒంటిపై కాషాయ రంగుతో కూడిన రెండు బట్టలు చూసి, **"ఇవి అవిశ్వాసులు ధరించే బట్టల్లో ఒక రకమైనవి, నీవు వీటిని ధరించకు"** అని చెప్పారు. (ముస్లిం 2077).

[ఇది కేవలం రంగు వరకే పరిమితం కాదు, రంగు, రూపం, విధానం అనన్నిట్లో కూడా వారి వేషాధారణ మాదిరిగా ఉండకూడదు. ఉదా: క్రైస్తవుల పాస్టర్లు లేదా నన్స్ ధరించేవి, యూదుల టోపి, హైందవ, బుద్ధ మత గురువుల ప్రత్యేక వేషాధారణ. విషయం ఏమిటంటే: ఇస్లాం తనదంటూ ఒక గుర్తింపు ఉండాలంటుంది. ఇతరుల పోలిక వారిస్తుంది].